బాహ్యవలయ రహదారి నిర్మాణానికి వినతి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మహబూబాబాద్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ప్రధాన జాతీయ రహదారులను కలుపుతూ బాహ్యవలయ రహదారిని నిర్మించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని స్థానిక శాసనసభ్యుడు భూక్యా మురళీనాయక్ తెలిపారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అయ్యప్పరెడ్డితో కలిసి ఎమ్మెల్యే సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై వివరించారు. పట్టణంలో పెరుగుతున్న జనాభా అవసరాల మేరకు బాహ్యవలయ రహదారి నిర్మాణానికి భూసమస్య లేదన్నారు. 80 శాతం ప్రభుత్వ భూమి ఉందని 20 శాతం పరిహారం చెల్లింపుతోనే రహదారి నిర్మాణానికి రూ. 125 నుంచి 130 కోట్లు వ్యయమవుతుందని వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరగా పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించినట్లు వివరించారు.



హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్

బడిలో పాము కలకలం

దంతాలపల్లి, న్యూస్‌టుడే: పాఠశాలలో పాము కలకలం సృష్టించిన సంఘటన మండలంలోని కుమ్మరికుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం చోటుచేసుకుంది. ఉపాధ్యాయులు, విద్యార్థుల కథనం ప్రకారం.. పాఠశాలలో పాము కనిపించడంతో తీవ్ర భయాందోళనకు గురైన విద్యార్థులు గది బయటకు పరుగులు తీశారు. అనంతరం ఉపాధ్యాయులు హతమార్చారు. పాఠశాల చుట్టూ వ్యవసాయ భూములు ఉండటం, పిచ్చిమొక్కలు పెరగడంతో విషపురుగులు వస్తున్నాయని తెలిపారు.

ఈనాడు మహబూబాబాద్

మంగళవారం అక్టోబరు 22, 2024

సన్నాల కొనుగోళ్లకు ప్రత్యేక కేంద్రాలు..!

ఈనాడు, మహబూబాబాద్: వానాకాలం ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వం సన్నాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వనున్న నేపథ్యంలో సన్న, దొడ్డు రకాల కొనుగోళ్లకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. అని పౌరసరఫరాల శాఖ మేనేజర్ కృష్ణవేణి పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు, సేకరణ తదితర వివరాలపై 'ఈనాడు' ముఖాముఖిలో ఆమె పలు వివరాలు వెల్లడించారు.

ఈ: సన్నాలు, దొడ్డు రకాలను ఎంత మేర సేకరించాలని నిర్ణయించుకున్నారు. ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారా?

పౌ.మే: జిల్లాలో 3,84,274 టన్నుల సన్నాలు, 74 వేల టన్నుల దొడ్డు రకాల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇందులో కొనుగోలు కేంద్రాలకు 2,24,516 టన్నుల సన్నాలు, 64,266 టన్నుల దొడ్డు రకాల ధాన్యం మొత్తంగా 2,88,782 టన్నులు వస్తాయని అంచనా. సన్నాలు, దొడ్డు రకాలను సేకరించేందుకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం.



కృష్ణవేణి, పౌరసరఫరాల శాఖ మేనేజర్

ముఖాముఖి

జిల్లా వివరాలు ఏర్పాటు ఇలా

కొనుగోలు కేంద్రాలు: 234

ఐకేపీ: 64, పీఏసీఎస్: 153

జీసీసీ:11, మెప్మా, ఎఫ్‌పీవో, ఇతర: 6

? ఎన్ని రకాల సన్నాలను సేకరిస్తారు. ఏవిధంగా నిర్ధారిస్తారు.?

✓ 33 రకాల సన్నాలను సేకరిస్తాం. వివరాల ఫ్లెక్సీని కేంద్రాల వద్ద ఏర్పాటు చేస్తాం. గుర్తించడానికి వ్యవసాయశాఖ ఏఈవోలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇచ్చాం. ప్రతీ కేంద్రానికి గ్రెయిన్ కాలిపర్(డయల్ మైక్రోమీటర్) యంత్రాన్ని ఇస్తాం. ఏఈవోలు జారీ చేసే టోకెన్‌పై ధాన్యం రకం, సంతకం, స్టాంప్ తప్పనిసరిగా ఉండాలి. కొనుగోలుదారు అయితే కొనుగోలుకు ముందు ఏఈవో వద్ద కౌలు రైతు వివరాలు, వ్యక్తిగత బ్యాంకు వివరాలు నమోదు చేయించుకోవాలి. టోకెన్లు ఉంటేనే తూకాలు అవుతాయి.

? బోనస్ చెల్లింపులో ఎలాంటి విధానాలను అమలు చేయనున్నారు. సన్నాలు, దొడ్డు రకాల బస్తాల గుర్తింపునకు ప్రత్యేక విధానం ఉందా.?

✓ సన్నరకాలకు బోనస్ చెల్లింపు ప్రత్యేకంగా ఉంటుంది. కర్షకుడి బ్యాంకు ఖాతాలో కనీస మద్దతు ధర చెల్లింపు, బోనస్ చెల్లించే ప్రక్రియ వేర్వేరుగా జరుగుతుంది. ఇందుకు రైతు మొబైల్‌కు రెండు సంక్షిప్త సమాచారాలు వస్తాయి. కాంటాలు చేసిన సన్న ధాన్యం బస్తాలను ఎరుపు రంగు సుతిలితో, దొడ్డు ధాన్యం బస్తాలను ఆకుపచ్చ రంగు సుతిలితో కుడతారు. సన్న ధాన్యం బస్తాపై 6x6 ఇంచులతో 'ఎస్' ఆకారం ముద్ర వేయిస్తాం.

? గతంలో బకాయిలున్న వాటికి కేటాయింపులు చేస్తారా..?

✓ ప్రస్తుతం 10 మిల్లులను గుర్తించాం. వీటి సంఖ్య పెరగనుంది. జిల్లా సహా గతంలో మాదిరిగా పక్క జిల్లాల్లోని మిల్లులకు కేటాయింపుల అనుమతులు వస్తే తరలిస్తాం. గతంలో సీఎంఆర్ బకాయిపడ్డ మిల్లులకు కేటాయించలేదు. ఎవరైనా చెల్లిస్తే అప్పుడు నిర్ణయం తీసుకుంటాం.

? ప్రతిసారి రవాణా సమస్యలు..గన్నీ సంచుల కొరత సమస్య ఎదురవుతోంది. రాకుండా ఎలాంటి చర్యలు తీసుకొంటారు?

✓ రవాణాపరమైన ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. 72,19,550 గన్నీ సంచులు అవసరం. ప్రస్తుతం 41,63,210 బస్తాలున్నాయి. మరిన్ని తెప్పిస్తాం. కేంద్రాల వద్ద రైతులకు టెంటు, తాగునీరు, విద్యుత్తు సౌకర్యంతోపాటు మహిళా రైతుల కోసం తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తాం.

ఈ సన్నరకాలకే.. రూ.500 బోనస్ 6లో..

బడి బాగుపై పట్టింపేది?



మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని తరగతి భవనం పైకప్పు గత ఆగస్టు 11న తేదీన కూలిపోగా మరమ్మతు పనులను ఇప్పటి వరకు పట్టించుకోలేదు. నిత్యం విద్యార్థులు తిరుగుతున్న పరిస్థితుల్లో కనీసం పెచ్చులను కూడా తొలగించలేదు. విద్యార్థులు అటుగా వెళ్లకుండా ఉపాధ్యాయులు కర్రను అడ్డుగా పెట్టారు. భవనం మరమ్మతు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, బయ్యారం (కొత్తగూడ)

టీజీ ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

మట్టెవాడ, న్యూస్‌టుడే: టీజీ ఎప్‌సెట్-2024 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైనట్లు వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డా.బైరి ప్రభాకర్ తెలిపారు. సోమవారం వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల ప్రక్రియకు 423 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇంటర్(బైపీసీ) పూర్తి చేసి, టీజీ ఎప్‌సెట్‌కు అర్హత సాధించిన విద్యార్థులు బీఫార్మసీ, ఫామ్ డీ, ఫార్మాసుటికల్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ తదితర కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ నెల 23 వరకు ధ్రువపత్రాల స్లాట్ ఎంచుకోవచ్చని వివరించారు. ఉదయం 9 గంటల నుంచి 6 గంటల వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. సీట్ అలాట్‌మెంట్ 28న జరుగుతుందని, ఈ నెల 30న ప్రవేశం పొందిన కళాశాలలో చేరాలని సూచించారు.



వివరాలు 6లో...

మృత్యువులోనూ వీడని స్నేహం..!

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థుల దుర్మరణం

మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: వారిద్దరు బాల్య స్నేహితులు.. గ్రామంలోనూ కలిసి, మెలిసి తిరిగేవారు.. ఒకరు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతుండగా, మరొకరు మహబూబాబాద్‌లోని పత్తిపాక మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వారిద్దరిని సోమవారం జరిగిన రహదారి ప్రమాదంలో మృత్యువు కాటేసింది. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపిన వివరాల మేరకు.. గూడూరు మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన నీల రమేష్- గౌతమి దంపతుల రెండోకుమారుడు నీల అరుణ్‌కుమార్(18), అదే గ్రామానికి చెందిన సంగెం ఉపేందర్- మంజుల దంపతుల కుమారుడు సంగెం నీలకంఠ(19) సోమవారం మధ్యాహ్నం పొనుగోడు నుంచి మహబూబాబాద్‌కు బయలుదేరారు. తన మిత్రుడైన అరుణ్‌కుమార్‌ను జిల్లా కేంద్రంలోని జ్యోతిబాపులే కళాశాలకు పంపించేందుకు మణికంఠ ద్విచక్రవాహనంపై అతనికి తోడుగా వెళ్లాడు. జమాండ్లపల్లి అర్బన్ పార్కు సమీపంలోని జాతీయ రహదారిలో మహబూబాబాద్ వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొని వారిద్దరి ప్రాణాలను బలి కొంది. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపికారెడ్డి సంఘటనాస్థలికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించి మృతదేహాలను 108 ద్వారా మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడమే ప్రమాదానికి కారణమని సీఐ తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.



పొదల్లోకి దూసుకెళ్లిన కారును పరిశీలిస్తున్న రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపిక



అరుణ్‌కుమార్, మణికంఠ (పాతచిత్రాలు)

పొనుగోడులో విషాదం...

రోడ్డు ప్రమాదంలో స్నేహితులు ఇద్దరు మృతి చెందడంలో పొనుగోడు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రమేష్-గౌతమి దంపతులకు ముగ్గురు కుమారులు కాగా రెండోకుమారుడు అరుణ్‌కుమార్. వ్యవసాయం చేసుకుంటూ తమ పిల్లలను చదివిస్తున్నారు. ఉపేందర్-మంజుల దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడిని కూలీ పనులు చేస్తూ హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో చదివిస్తున్నారు. దసరా సెలవుల అనంతరం స్నేహితుడిని కళాశాలకు పంపి మరుసటి రోజు తానుకూడా కళాశాలలకు వెళ్లాలనుకున్నారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో ఒకేసారి ఇద్దరు మృతి చెందడం గ్రామంలో విషాదం నెలకొంది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్ కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

న్యాయం చేయాలంటూ ఆందోళన

ప్రమాదానికి కారణమైన వ్యక్తిని శిక్షించి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలంటూ సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని అండర్ బ్రిడ్జిలో బాధితులు, పొనుగోడు గ్రామస్థులు రాస్తారోకో నిర్వహించారు. న్యాయం జరిగేలా కృషి చేస్తామని డీఎస్పీ తిరుపతిరావు ఫోన్ ద్వారా హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పోలీసు అమరవీరుల త్యాగం స్ఫూర్తిదాయకం



అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: దేశ రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. పరేడ్ కమాండర్ అనిల్ ఆధ్వర్యంలో స్మృతి పరేడ్ నిర్వహించారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ పోలీసు అమరుల త్యాగాలను స్మరిస్తూ దేశ రక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల రుణం తీర్చుకోలేమన్నారు. ఇటీవల జిల్లాలో వచ్చిన వరదల్లో జిల్లా పోలీస్ శాఖ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలను రక్షించడం అభినందనీయమన్నారు. ఏఎస్పీ జోగుల చెన్నయ్య దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అధికారుల పేర్లు చదివి నివాళులర్పించారు. అధికారులు, సిబ్బంది పోలీసు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మానుకోట మార్కెట్‌లో రైతన్నల నిరసన

నెహ్రూసెంటర్, కేసముద్రం, న్యూస్‌టుడే: మహబూబాబాద్ మార్కెట్‌లో సోమవారం మధ్యాహ్నం 2 గంటల వరకు ఆన్‌లైన్ సేవల్లో అంతరాయం ఏర్పడినందున రైతులకు ఈనామ్ రసీదులు అందలేదు. వ్యాపారులు రాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేసి ఆందోళనకు దిగారు. ఆన్‌లైన్ సేవల్లో అంతరాయం ఏర్పడిందని డీఎంఓ వెంకటేశ్వర్లు, మార్కెట్ కార్యదర్శి షంషీద్ రైతులకు వివరించారు. పట్టణ సీఐ పి.దేవేందర్ మార్కెట్‌కు చేరుకొని రైతులను సముదాయించారు. వ్యాపారులు వేలం పాట ద్వారా పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడం ప్రారంభించడంతో ఆందోళన విరమించారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్ లోనూ లాట్ నెంబర్లు ఇవ్వకపోవడంతో రైతులు పడిగాపులు పడ్డారు. మార్కెట్ ఛైర్మన్ గంట సంజీవరెడ్డి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. వ్యాపారులు లాట్ నెంబర్లను చిట్టీలపై రాసి ఇచ్చారు. ఎక్కువ ధరకు వేసిన వ్యాపారికి కేటాయించారు.

తరలివచ్చి.. విన్నవించి..!



కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతి పత్రం అందిస్తున్న దరఖాస్తుదారులు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: 'క్షేత్రస్థాయి అధికారుల వద్దకు వెళితే పరిష్కారం కావడం లేదు.. సాయమందడం లేదు.. పట్టించుకునే వారు కరవయ్యారు.. మీరైనా మా మొర ఆలకించి న్యాయం చేయాలి' అంటూ జిల్లా నలుమూల నుంచి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి తరలివచ్చి కలెక్టర్‌ను వేడుకున్నారు. వివిధ విభాగాలకు చెందిన సమస్యలపై 114 దరఖాస్తులు రాగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పో వాటిని పరిశీలించి పరిష్కరించాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు.

పింఛన్ రాక.. చెప్పేవారు లేక..

ఇనుగుర్తికి చెందిన దివ్యాంగుడు బోయిన కొమరయ్యకు పిల్లలు లేరు. దంపతులు పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ప్రమాదంలో కొమరయ్యకు కాళ్లు దెబ్బతిన్నాయి. శస్త్ర చికిత్స చేసి రాడ్లు అమర్చారు. ఎక్కువ దూరం నడవలేడు. భార్య సుగుణమ్మతో కలిసి పనిచేస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. 2019లో సదరం ధ్రువీకరణ పత్రం జారీ చేయగా రెండేళ్లు దివ్యాంగుల పింఛన్ చెల్లించారు. ఆ తర్వాత నిలిపివేశారు. మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా కనీసం సమాచారం ఇవ్వడం లేదు. సుగుణమ్మ పక్షవాతంతో మంచం పట్టారు. దివ్యాంగుడి సాయంతో కలెక్టరేట్‌కు వచ్చి తన సమస్యను విన్నవించారు.



కదలలేక.. కుల వృత్తి చేయలేక..

గుముడూరు ప్రాంతానికి చెందిన ఇతని పేరు జంపాల రాములు మానుకోటలో క్షౌరశాల నిర్వహించేవారు. కొన్నాళ్ల కిందట పక్షవాతం వచ్చి కాళ్లు, చేతులు చచ్చుపడిపోయి మంచానికే పరిమితమయ్యారు. పింఛన్ కోసం అధికారుల వద్దకు వెళితే పట్టించుకోవడం లేదని భార్యను తోడుగా తీసుకుని వచ్చి జిల్లా పాలనాధికారిని కలిసి తన సమస్యను వివరించారు.




మరికొన్ని సమస్యలు ఇలా

- పర్వతగిరి శివారు నుంచి తమ వ్యవసాయ భూమిలో నుంచి వెళుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే వల్ల నష్టపోతున్న భూమికి పూర్తి పరిహారం చెల్లించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన జి.కోటయ్య కలెక్టర్‌ను వేడుకున్నారు.
- రెండు వేల జనాభా కలిగిన తమ తండాకు దారి లేకుండా మరిపెడ పురపాలక సంఘం పరిధిలోని కొందరు 60 ఎకరాల భూమిని స్థలాలుగా విక్రయించేందుకు వెంచర్ చేశారని, దారి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బొత్తల తండాగిరిజనులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- నెల్లికుదురు మండలం రావిరాల గ్రామానికి చెందిన మహిళ దొంగరి శ్రీలత బోధకాలు పింఛన్ మంజూరు చేయాలని వేడుకున్నారు.

వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా జిల్లావాసి

మహబూబాబాద్, కురవి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా కురవి మండలం అయ్యగారిపల్లికి చెందిన మేక సునీల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవసాయ సహకార శాఖ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు సోమవారం రాత్రి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కమిషన్‌లో ఏడుగురి సభ్యుల్లో జిల్లావాసికి అవకాశం దక్కడంపై స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది. ఇరవై ఏళ్లుగా పైగా రైతుల సమస్యలపై పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్న సునీల్‌కుమార్ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధరణి అధ్యయన కమిటీ సభ్యుడిగా పని చేస్తున్నారు. 2004లో నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం నుంచి న్యాయ శాస్త్రంలో పట్టా పొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలనాసంస్థ రాష్ట్ర లీగల్ కో-ఆర్డినేటర్‌గా 2004 నుంచి 2008 వరకు పని చేశారు. 2009 నుంచి 2017 వరకు రూరల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్‌గా పని చేశారు.



మేక సునీల్‌కుమార్

ఇద్దరూ ఒకే పాఠశాలకు..

దంతాలపల్లి, న్యూస్‌టుడే: తన కూతురును సర్కారు బడిలో చేర్పించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు పెద్దముప్పారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు. గ్రామానికి చెందిన కె.సుమతి డీఎస్సీ-2024 ద్వారా ఎస్‌జీటీగా విధుల్లో చేరారు. తన పెద్ద కుమార్తె అద్విరికను సోమవారం ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ప్రవేశ పత్రాన్ని ప్రధానోపాధ్యాయుడు కిషన్‌నాయక్‌కు అందజేసి ఒకటో తరగతిలో చేర్పించారు.



ప్రధానోపాధ్యాయుడికి కుమార్తె ప్రవేశ పత్రాన్ని అందిస్తున్న ఉపాధ్యాయురాలు

నియామకం

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ఎన్ఎస్‌యూఐ మహబూబాబాద్ మండల మాజీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, పట్టణానికి చెందిన గుండెపాక కరుణాకర్‌ను టీపీసీసీ ప్రచారకమిటీ కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు అందజేశారు.

విరులు.. లాభాల సిరులు



నర్సంపేట, ఎల్కతుర్తి, న్యూస్‌టుడే : బంతి పూల సాగు లాభదాయకంగా ఉండటంతో పలువురు రైతులు ఈ సాగుపై మక్కువ చూపుతున్నారు.. స్వల్ప పెట్టుబడి.. తెగుళ్లు, చీడపీడల బాధలు తక్కువే.. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం రాజపల్లిలో ఎడ రమేశ్ ఎకరం భూమిలో, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపూర్‌లో రైతు అంబాల కరుణాకర్ ఎకరంలో బంతి సాగు చేశారు. దసరా, దీపావళి పండగల నేపథ్యంలో మార్కెట్‌లో ఆశించిన ధర పలుకుతోంది. రమేశ్ తన మిత్రుడి సాయంతో గత జులైలో ఈస్ట్‌వెస్ట్ కంపెనీకి చెందిన బంతి విత్తనాన్ని బెంగళూరు నుంచి తెప్పించి నారు పోసినట్లు తెలిపారు. నారు పోసిన 25 రోజుల తర్వాత మొక్కలు నాటారు. అంతరకృషి, మొక్కలకు ఎరువులు వేశారు. 52 రోజులకు రెక్కల పురుగు నివారణకు పురుగు పిచికారీ చేశారు. పూలు మొత్తం నాలుగు కోతలు వస్తాయి. మొదటి కోత తొలి బతుకమ్మ(అమావాస్య)కు కోయగా దిగుబడి టన్నున్నర వచ్చింది. కిలో రూ.80 ధర పలికింది. సద్దుల బతుకమ్మకు రెండో కోత మూడు టన్నుల దిగుబడి రాగా, ధర రూ.60-70 వరకు ధర పలికింది. ఈ రెండు విడతలో దాదాపు రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చిందని రైతు రమేశ్ వివరించారు.

ఆదర్శం



తోటలో పనులు చేస్తున్న రమేశ్ దంపతులు

రూ.2.5 లక్షలు వస్తాయని అంచనా..

-అంబాల కరుణాకర్, రైతు



రెండేళ్ల నుంచి బంతి సాగు చేస్తున్నాను. సుమారు రూ.3 లక్షల ఆదాయం వస్తుందని అంచనా.. పెట్టుబడి రూ.50వేలు పోగా రూ.2.5 లక్షలు చేతికి వస్తాయి..

ప్రశ్న- సమాధానం

? పత్తి పంటలో ఆకులు నల్లగా మారుతున్నాయి. ఎండిపోయి రాలుతున్నాయి. నివారణ చర్యలు తెలపండి..? -రైతు, రావుల లక్ష్మయ్య, సూధన్‌పల్లి.

✔ బ్యాక్టీరియాతో ఆకులు నల్లగా మారుతున్నాయి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ రెండు గ్రాముల మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పంట ఎదుగుదలకు ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను నేల ద్వారా మొక్కలకు అందించాలి. పైపాటుగా లీటరు నీటికి 10 గ్రాముల యూరియా స్థూల పోషకాల మిశ్రమాన్ని వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

-డా.రాజు, శాస్త్రవేత్త, కేవీకే వరంగల్

–వరంగల్ వ్యవసాయం

రైతేరాజు

ఈ సన్నరకాలకే.. రూ.500 బోనస్!



పాకాల ఆయకట్టులో సాగవుతున్న సన్నవరి

ఖానాపురం, గోపాలపూర్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వరి పండించే రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.. అయితే, ఏయే రకాలకు బోనస్ ఇస్తారో తెలియక అన్నదాతలు అయోమయంలో ఉన్నారు. ఇటీవల ఆయా రకాల జాబితాను వ్యవసాయ శాఖకు ప్రభుత్వం విడుదల చేసింది. 33 రకాల సన్నాల వరికి బోనస్ ఇవ్వనున్నట్లు ప్రకటించారని వ్యవసాయాధికారి భోగ శ్రీనివాస్ ‘రైతేరాజు’కు తెలిపారు. సిద్ధి(డబ్ల్యూజీఎల్44), కేపీఎస్ 2874(కంపాసాగర్ వరి-1), సాంబమశూరి, జగిత్యాల వరి-3, జగిత్యాల వరి-2, వరంగల్ సాంబ(వరంగల్ 14), వరంగల్ సన్నాలు, జగిత్యాల మసూరి, పొలాస ప్రభ(జేజీఎల్384), క్రిష్ణ(ఆర్ఎన్నార్2458), మానేరు సోన, తెలంగాణ సోన(ఆర్ఎన్నార్ 15048), వరంగల్ వరి-1119, కూనారం వరి-2, వరంగల్ వరి-2, రాజేంద్రనగర్ వరి-4, కూనారం వరి-1, జగిత్యాల సన్నాలు, జగిత్యాల సాంబ, అంజన(జేజీఎల్ 1118), నెల్లూరు మసూరి, ప్రద్యుమ్న, సుగంధ సాంబ, శోభిని, సోమనాథ్, ఆర్ఎన్నార్, కేపీఎస్ 6261, జేసీఎల్ 33124, హెచ్ఎంటీ సోన, మారుతీ సాంబ, మార్టేరు మసూరి, ఎంటీయూ 1271 రకాలు జాబితాలో ఉన్నాయి. వీటితో పాటు సన్నగింజ ఉండి 6 మి.మీ. పొడవు, వెడల్పు 2 మిల్లీమీటర్ల కన్నా తక్కువగా ఉన్న పరిమాణాన్ని పరిగణలోకి తీసుకుని సన్నరకాలను గుర్తించి బోనస్ చెల్లిస్తారు. ధాన్యం కొనుగోలు సందర్భంగా వ్యవసాయాధికారులు వెర్నియర్ కాలిపర్స్‌తో సూక్ష్మ కొలతలు గణించి ప్రతి వడ్లను పరిశీలించి నిర్ధారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా రైతు పండించిన పంట మొత్తానికి బోనస్ ఇస్తారా..? రైతు భరోసా కటాఫ్ ఎకరాలకు ఇస్తారో ఇంకా నిర్ధారించలేదు.

–న్యూస్‌టుడే
వరంగల్ వ్యవసాయం

రైతుకు భరోసా.. మాన్‌ధన్ యోజన



కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన ద్వారా వయసు పై బడిన రైతులకు సామాజిక భద్రత కల్పిస్తోంది. గరిష్ఠంగా రెండు హెక్టార్లు(5 ఎకరాలు)లోపు సాగు భూమి ఉండి 18-40 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులు. అధికారులు, ఉద్యోగులు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజినీర్లు ఇతర వృత్తి నిపుణులు దీనికి అనర్హులు. ఆదాయపు పన్ను చెల్లిస్తున్నవారు, నిర్దేశించిన దాని కంటే అధిక రాబడి పొందుతున్నవారు, ప్రభుత్వ పథకాల లబ్ధి పొందినవారు కూడా పథకంలో చేరేందుకు వీల్లేదు. రైతులు కామన్ సర్వీసు కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలి. ఫోటో, నివాస, ఆధార్, ధ్రువీకరణ, వయసు నిర్ధారణ, సాగు భూమి పత్రాలు, ఆధార్ కార్డు సమర్పించాలి. పీఎంకేఎం పోర్టల్‌లో నమోదు చేశాక చందాదారుని నంబరుకు సందేశం వస్తుంది. ప్రత్యేకంగా పింఛను ఖాతా తెరిచి కార్డు ఇస్తారు. ఇందుకైన ఖర్చు రూ.30లను ప్రభుత్వమే చెల్లిస్తుంది.

వయసు ఆధారంగా ప్రీమియం : పథకంలో చేరిన రైతులు వయసును బట్టి ప్రీమియం డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. 18 ఏళ్ల వారు నెలకు రూ.55 చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం రూ.55 కలిపి బీమా కంపెనీకి రూ.110 చెల్లిస్తుంది. ఏటా వయసును బట్టి ప్రీమియం రూ.3 నుంచి రూ.10 వరకు పెరుగుతుంది. 40 ఏళ్లకు పైబడిన వారు రూ.200 చెల్లించాలి. ఇంతే మొత్తం ప్రభుత్వమూ చెల్లిస్తుంది. 60 ఏళ్లు వచ్చే వరకు ప్రీమియం కట్టాలి. ఆ తర్వాత ప్రతి నెల రూ.3 వేల చొప్పున పింఛను వస్తుంది. ఒకసారి డబ్బులు కావాలనుకుంటే రైతు కట్టిన, సర్కారు చెల్లించిన మొత్తంలో సగం ఒకసారి అందజేస్తారు.

నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లిస్తేనే.. -కె.దామోదర్‌రెడ్డి, ఏడీఏ, నర్సంపేట

లబ్ధిదారు మరణిస్తే జీవిత భాగస్వామికి సగం పింఛను రూ.1500 ఇస్తారు. పథకాన్ని కొనసాగించేందుకు కనీసం అయిదేళ్లపాటు రైతు వాటా నెలవారీ కిస్తీలను నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లించాలి.

షట్లర్ శ్రీచేతన్‌శౌర్యకు రెండో ర్యాంకు



వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా సబ్ జూనియర్(అండర్-13) బ్యాడ్మింటన్ ర్యాంకింగ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడాకారుడు శ్రీచేతన్‌శౌర్య తన స్థానాన్ని మెరుగుపర్చుకున్నాడు. బాలుర డబుల్స్ విభాగంలో 2వ స్థానంలో, సింగిల్స్‌లో 4వ స్థానంలో నిలిచాడు. ఇటీవల జరిగిన పలు జాతీయస్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించి.. వ్యక్తిగత ర్యాంకింగ్‌లో దూసుకెళ్లాడు. హనుమకొండలోని పెద్దమ్మగడ్డకు చెందిన శ్రీచేతన్‌శౌర్య ఆటతీరు అభినందనీయమని వరంగల్ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి రమేష్‌రెడ్డి, సంఘం ప్రతినిధులు డా.రమేష్‌కుమార్, నాగకిషన్ పేర్కొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

వరంగల్ క్రీడావిభాగం : వరంగల్ చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణ ప్రతినిధి కన్నా తెలిపారు. హనుమకొండలోని తితిదే వేడుకల మందిరంలో అండర్-15 విభాగంలో బాలబాలికలకు పోటీలు ఉంటాయన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభిస్తారన్నారు. తొలి నాలుగు స్థానాల్లో నిలిచే బాలబాలికలు తమిళనాడులో జరిగే జాతీయస్థాయిలో పాల్గొంటారని చెప్పారు.

అమ్మ కోసం.. సాంకేతిక బాట

యాప్‌పై శిక్షణకు శ్రీకారం

ఇంట్లో కూతురు/కోడలు గర్భం దాల్చితే వారి బాగోగులను పెద్దవాళ్లు చూసుకుంటారు. ఇప్పుడిక ట్రెండ్ మారుతోంది. రానున్న రోజుల్లో ఆధునికత చేదోడు కానుంది. సాంకేతిక బాట పట్టిన గర్భ సంరక్షణ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. నేషనల్ హెల్త్ మిషన్, యునిసెఫ్ భాగస్వామ్యంతో అర్మన్ అనే స్వచ్ఛంద సంస్థ రూపకల్పన చేసిన ‘అమ్మ కోసం’ యాప్ ప్రయోజనకరంగా మారనుంది. ఇది గర్భిణులు, బాలింతలు, పిల్లల శ్రేయస్సుకు దోహదపడుతుంది.

అమ్మ కోసం యాప్‌ను అమలు చేయడానికి ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఆరు జిల్లాల పరిధిలోని వైద్య ఆరోగ్యశాఖల ఆధ్వర్యంలో ఏఎన్ఎంలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఇటీవల ప్రారంభించారు.

–న్యూస్‌టుడే, డోర్నకల్

ఆరోగ్య కల సాకారం

అరచేతిలో స్మార్ట్‌ఫోన్ ఇమిడి ఉంది. దైనందిన జీవితంలో ఒకటిగా మారింది. ఇప్పుడు ‘అమ్మ-కోసం’ యాప్ పురుడు పోసుకోవడంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఆరోగ్య సంబంధ అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చే ప్రధాన వనరుగా మారింది. గర్భధారణ సమయంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడం ఎలా? పిండం ఎదుగుదలను పర్యవేక్షించడం ఎలా?.. తదితర అంశాలను తెలుసుకునే వీలుంది. లోపాలుంటూ వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు.

డౌన్‌లోడ్ ఇలా..

గూగుల్ ప్లేస్టోర్‌లో అమ్మ-కోసం యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. అవసరమైన అనుమతులు అంగీకరించాక లాగిన్ ప్రక్రియని కొనసాగించాలి.

☛ యూజర్ నేమ్, పాస్‌వర్డు నమోదు చేసి ‘రిమెంబర్ మీ’ చెక్‌బాక్స్ మీద నొక్కాలి.

☛ తెరపై ఐహెచ్ఆర్‌పీటీఎం పేరిట ‘డ్యాష్‌బోర్డు’ కనిపిస్తుంది.

☛ బ్యాక్ గ్రౌండ్‌లో చూపిన విధంగా ఆఫ్‌లైన్‌లో ఉపయోగించుకునేందుకు అన్ని కోర్సు-లెసన్ ఫైళ్లని సైతం డౌన్‌లోడ్ చేస్తుంది. ఒకవేళ ఆటోమెటిక్‌గా డౌన్‌లోడ్ కాని పక్షంలో ‘సింక్ ఐకాన్’పై క్లిక్ చేస్తే డౌన్‌లోడ్ అవుతుంది.

ఇవీ ప్రయోజనాలు..

☛ లెర్నింగ్ మేనేజ్‌మెంటు సిస్టం(ఎల్ఎంఎస్) ద్వారా పీడీఎఫ్, వీడియో, ఆడియో, ఇమేజ్ వివిధ ఫార్మాట్లలో కోర్సు పాఠాల వీక్షణకు ఇది వీలు కల్పిస్తుంది.

☛ కోర్సు లెసన్ ఫైళ్లలోకి వెళితే.. ప్రస్తుతం పురోగతిలో ఉన్న వాటితో పాటు ప్రారంభించని కోర్సుల జాబితా కనిపిస్తుంది. చిట్కాలు అందిస్తుంది

☛ ప్రసవానికి ముందు, తర్వాత చేయాల్సిన వ్యాయామాలను ఇది సూచిస్తుంది

☛ మంచి పోషణకు ఆహారాన్ని తీసుకోవడంలో తోడుంటుంది

☛ బాలింతలకు అవసరమైన సూచనలు చేస్తుంది

☛ పిల్లల విషయంలో జాగ్రత్తలను తెలుపుతుంది.

ఉమ్మడి జిల్లా స్వరూపం

జిల్లా	గర్భిణులు	బాలింతలు	పిల్లలు
మహబూబాబాద్	4930	3943	44837
జయశంకర్ భూపాలపల్లి	2653	2431	24476
హనుమకొండ	4231	3987	45552
వరంగల్	6128	6432	50423
జనగామ	3396	2430	23643
ములుగు	2874	2497	21624

గర్భిణులకు మేలు

- డా.మధుసూదన్, జిల్లా వైద్యాధికారి, శ్రీదేవి, జిల్లా ప్రోగ్రాం అధికారి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

అమ్మ-కోసం యాప్ గర్భిణులకు ఒక కల్పతరువు. హైరిస్క్ గర్భిణులు తీసుకోవాల్సిన చర్యలపై ఏఎన్ఎంలకు అవగాహన కల్పిస్తున్నారు. వీటిలో గర్భస్థ సమయంలో కొవిడ్, రక్తహీనత, అధిక రక్తపోటు, ప్రసవపూర్వ రక్తస్రావం, మధుమేహం, గత సిజేరియన్ స్థితి, పిండం ఎదుగుదల ముఖ్యమైనవి. యాప్‌ను ఏఎన్ఎంల ట్యాబ్‌లలో డౌన్‌లోడ్ చేశారు. పదిహేను రోజులకు ఒకసారి ఒక్కో అంశంపై వీరికి ఒక లింక్‌ను ఆడియో/వీడియో రూపంలో పంపిస్తారు.

తెలుగులో సులభంగా అర్థం అవుతుంది

- సీహెచ్ స్వప్న, ఏఎన్ఎం, భూపాలపల్లి



అమ్మ కోసం యాప్ తెలుగులో ఉండటంతో సులభంగా అర్థమవుతోంది. శిక్షణలో గర్భిణులు, వారు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, చికిత్సకి సంబంధించిన అంశాలను వివరించారు.



భూపాలపల్లిలో శిక్షణకు హాజరైన ఏఎన్ఎంలు

‘కల్వకుంట్ల కుటుంబం ఆస్తుల వివరాలు ప్రకటించాలి’

జనగామ, న్యూస్‌టుడే: ‘కల్వకుంట్ల కుటుంబానికి నిజాయతీ ఉంటే, 2014లో మీ ఆస్తులు ఎన్ని, ఇపుడెన్ని? అనే వివరాలను ప్రకటించాలని’ మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, కవిత, సంతోష్, హరీశ్‌రావులు అధికార కూటమిగా మారి దోపిడి చేశారని ఆరోపించారు. జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా విపణిలో సోమవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఎంపీ కడియం కావ్య, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్న సభలో శ్రీహరి మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో కమిషన్ల కోసం పనులు తప్ప, అభివృద్ధి జరగలేదని, అందుకే ప్రస్తుతం సమస్యలు పేరుకున్నాయని విమర్శించారు. తాను భారాసలో ఉన్నప్పుడు విద్య, ఉపాధిపై సమీక్షకు గంట సమయం ఇవ్వలేదని, ప్రజా సమస్యలపై మాట్లాడితే తనను పక్కన పెట్టారని ఆరోపించారు. డీఎస్సీ ప్రక్రియను ఆరు మాసాల్లో విజయవంతంగా పూర్తి చేసి 11 వేల కుటుంబాల్లో సీఎం వెలుగులు నింపారన్నారు. భాజపా నాయకత్వం ఆధిపత్యం కోసం కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రఘునందన్‌రావు, ఈటల పోటీపడుతున్నారన్నారు. మూసీ, హైడ్రా విషయంలో వారి మాటల్లో పొంతనలేదని, ఒక్కనాడైనా కలిసి ఈ అంశాలపై స్పష్టతనిచ్చారా? అని ప్రశ్నించారు. రూ.7 లక్షల కోట్ల అప్పులతో ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గొప్ప సంకల్ప బలంతో ముందుకు వెళ్తోందని వివరించారు.

డమ్మీ తుపాకితో బెదిరించిన దుండగుడికి దేహశుద్ధి



నిందితుడు

దామెర, న్యూస్‌టుడే: డమ్మీ తుపాకీతో కిరాణ దుకాణ యజమానిని బెదిరించిన వ్యక్తికి గ్రామస్థులు దేహశుద్ధి చేసిన సంఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు కుడికిరాల సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఊరుగొండకు చెందిన సంపత్ జాతీయరహదారి పక్కన కిరాణ దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం ములుగు జిల్లాకు చెందిన ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి దుకాణం షట్టర్లు తట్టి బిస్కెట్ ప్యాకెట్ కావాలని కోరాడు. దీంతో సంపత్ షట్టర్ తెరవగానే.. దుండగుడు డమ్మీ తుపాకి చూపించి డబ్బులివ్వకపోతే చంపేస్తానని బెదిరించాడు. తన వద్ద డబ్బులు లేవంటూ సంపత్ భయంతో కేకలు వేశాడు. స్థానికులు వచ్చి ఆ వ్యక్తిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సంపత్ తెలిపారు. దుండగుడు గతంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిసింది. నిందితుడిని విచారిస్తున్నట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు.

పాఠశాలలో సార్వత్రిక ప్రవేశాలు షురూ!

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ఖిలావరంగల్ మధ్యకోట ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో ప్రవేశాలు ప్రారంభమైనట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా కో-ఆర్డినేటర్ మూరాల శంకరరావు తెలిపారు. సోమవారం ప్రవేశాల ప్రచార గోడపత్రికలను ఆవిష్కరించారు. ఇతర వివరాలకు పాఠశాల అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ శైలేంద్రకుమార్ 96034 86850 సంప్రదించాలన్నారు.

ప్రజాసేవలో పోలీసులు ముందుంటారు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజాసేవలో పోలీసులు ముందుంటారని అమరుల ఆశయ సాధనకు పనిచేస్తూ విధుల్లో రాణించాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. సోమవారం కమిషనరేట్‌లో అమరవీరుల స్తూపం వద్ద పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్‌డే) నిర్వహించారు. గతేడాది నుంచి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మృతి చెందిన 241 మంది పోలీసు అమరుల పేర్లను అదనపు డీసీపీ రవి చదివి వినిపించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్య, కర్నల్ రవికుమార్, డీసీపీలు షేక్ సలీమా, రవీందర్‌తో పాటు ఏసీపీలు ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐ, పోలీసు అమరుల కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు సిబ్బంది అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. ఆర్ఐ స్పర్జన్ సారథ్యంలో సాయుధ పోలీసుల శోక్‌శస్త్ర చేసి మరణించిన పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ప్రజల సేవ కోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీసులు త్యాగధనులన్నారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు పనిచేయాలన్నారు. నీతి నిజాయతీతో పనిచేస్తే గుర్తింపు ఉంటుందన్నారు. అమరవీరులు ఎల్లప్పుడూ మన గుండెల్లోనే ఉంటారన్నారు. వారి కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వారికి ఎలాంటి సమస్యలున్నా పోలీసు విభాగం తరపున సహకారం అందిస్తామన్నారు. అనంతరం కమిషరేట్ నుంచి హనుమకొండ మిషన్ ఆసుపత్రి వరకు పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు కలిసి ప్రదర్శన నిర్వహించారు. పోలీసు జాగృతి కళా బృందం సభ్యులు పాల్గొని పోలీసు అమరులకు జోహార్లు అర్పించారు.



అమరవీరుల స్తూపం అలంకరణ



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా. చిత్రంలో పై వరుస(ఎడమ నుండి కుడికి) హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావిణ్య, సత్య శారద, ఎన్‌సీసీ కమాండెంట్ కర్నల్ రవీంద్ర కుమార్ రవి, డీసీపీలు షేక్ సలీమా, రవీందర్. కింది వరస పోలీసు ఉన్నతాధికారులు రవి, మధుసూదన్, నందిరాం నాయక్, సత్యనారాయణ, దేవేందర్ రెడ్డి



స్మృతి పరేడ్‌లో పోలీసుల నివాళి

నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటా



శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్, చిత్రంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, తదితరులు

పాలకుర్తి, న్యూస్‌టుడే: జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం చేసి, మృతి చెందిన లకావత్ శ్రీను కుటుంబ సభ్యులను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ పరామర్శించారు. పాలకుర్తి మండలం మేకలతండాలోని శ్రీను నివాసాన్ని ఆయన సోమవారం సందర్శించి, విలేకరులతో మాట్లాడారు. శ్రీను మృతి ప్రభుత్వ హత్య అని అభివర్ణించారు. గిరిజన బిడ్డ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని వివరించారు. కాంగ్రెస్ నేత యాకాంతరావు ప్రమేయం ఈ ఘటనలో ఉందని తెలిసిందని, పోలీసులు ఉన్నా, అందరికీ శిక్ష పడేలా సీపీ, డీసీపీతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పారు. పోలీసులు విధుల పట్ల అంకితభావంతో పని చేయాలని, నాయకులకు ఒత్తాసు పలకడం సరికాదని అసహనం వ్యక్త చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, భాజపా జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామ్మోహన్‌రెడ్డి, తండావాసులు గాంధీ నాయక్, సురేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం



పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ డా.సత్యశారద తదితరులు

ఎనుమాముల మార్కెట్: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఎనుమాముల మార్కెట్ యార్డులో సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి.. గరిష్ఠ ధరను పొందాలన్నారు. తేమ వల్ల రైతులు నష్టపోకుండా పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనంతరం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ తొలివిడతలో వరంగల్ జిల్లాలోని 14 కేంద్రాల్లో సోమవారం పత్తి కొనుగోళ్లు ప్రారంభించామని వరంగల్ కలెక్టర్ డా.సత్యశారద పేర్కొన్నారు. మిగతా చోట్ల త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సీసీఐ డిప్యూటీ మేనేజర్ అర్జున్ దవే, జేడీఎం శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, డీఎంఓ సురేఖ, మార్కెట్ కార్యదర్శి నిర్మల, స్థానిక కార్పొరేటర్లు, అధికారులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)
వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243



కనరో భాగ్యం..!

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గార్ల మండలం ముర్రిగూడెం సమీపంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పారువేట, అశ్వవాహనసేవను నిర్వహించారు. మాజీ ఛైర్మన్ కస్నా నాయక్, భోజ్య, కాంతారావు, వశ్య, మల్సూరు, హన్మంతు, కొండల్ తదితరులున్నారు.

– న్యూస్‌టుడే, గార్ల



తొర్రూరులో నివాళి అర్పిస్తున్న పోలీసులు



నర్సింహులపేటలో..



డోర్నకల్‌లో..



నెల్లికుదురులో

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి

తొర్రూరు, నర్సింహులపేట, నెల్లికుదురు, డోర్నకల్, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లాలో పలు గ్రామాల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. రాత్రి వేళలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలో అమరవీరుల స్థూపం వద్ద ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ కూడలి మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో సీఐ జగదీష్, ఎస్సైలు ఉపేందర్, రాంజీనాయక్‌తోపాటు సిబ్బంది, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. డోర్నకల్‌లో పోలీసులు కొవ్వొత్తులతో సోమవారం ప్రదర్శన జరిపారు. గాంధీ కూడలిలో అమరవీరులకు నివాళులర్పించారు. సీఐ రాజేష్, ఎస్సైలు వంశీధర్, ఉమ, ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు. నర్సింహులపేట, నెల్లికుదురులో ఎస్సైలు మాలోతు సురేష్, సీహెచ్. రమేశ్‌బాబు ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జాతీయ మానవహక్కుల సేవా సంఘం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ బొట్టు రమేశ్, ఎస్సై మురళీధర్‌రాజు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ సుజాత, అధ్యాపకులు సునీత, సంస్థ బాధ్యులు విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రంలో బహుమతి అందజేస్తున్న ఎస్సై మురళీధర్‌రాజు

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762, మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499 డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

డోర్నకల్, న్యూస్‌టుడే: తోడేళ్లగూడెంలోని ఒక అంతర్గత వీధిలో గల కాలువలో పేరుకుపోయిన మురుగుని తొలగించండి. పరిసరాలను శుభ్రం చేయండి. **- వెంకట్రావు**

తగు చర్యలు చేపడతాం. **- సాయితేజ, పంచాయతీ కార్యదర్శి, డోర్నకల్**

మహబూబాబాద్ టౌన్: సీపీఐ వీరభవనం - కాకతీయ నగర్ కాలనీ ప్రధానరహదారిలో వీధి దీపాలు పూర్తిస్థాయిలో వెలగడం లేదు. **- స్వప్న రెడ్డి**

సమాధానం: మరమ్మతు చేయిస్తాం. **- డొలాగర్ స్వాతి, 26వ వార్డు కౌన్సిలర్.**

మహబూబాబాద్ టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పట్టణంలోని తొమ్మిదో వార్డు శనిగపురంలోని ప్రధాన మురుగునీటి కాల్వల్లో ఇసుక, మట్టి పేరుకుపోయి మురుగంతా రోడ్డుపై పారుతుంది. **- చుక్క సుమన్**

సమాధానం: కాల్వల్లో పూడిక తీయిస్తాం. **- బానోతు హరిసింగ్‌నాయక్, తొమ్మిదో వార్డు కౌన్సిలర్.**

వీధి దీపం ఏర్పాటు

స్పందనకు వందనం

డోర్నకల్, న్యూస్‌టుడే: లచ్యాతండాలో వీధి దీపం వెలగక ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకుని రాగా సమస్య 'ఈనాడు'లో ప్రచురితమైంది. వెలుతురు ప్రసరించడంతో తండావాసులు సంతోషం వ్యక్తం చేశారు

వ్యర్థాల తొలగింపు

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: విక్రమ్‌నగర్‌కాలనీ నుంచి చెవుల ప్రభాకర్ కాలనీవెళ్లే వీధిలో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించాలని ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ తోట రాజేష్ స్పందించారు. సిబ్బందిని, వాహనాన్ని పంపించి వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

28న ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు



షెడ్యూల్ విడుదల చేస్తున్న నిర్వహణ కమిటీ సభ్యులు

తొర్రూరు, న్యూస్‌టుడే: ఈనెల 28వ తేదీన స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్ పి.ఉపేందర్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ఛాంబర్ కార్యాలయంలో సోమవారం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ నెల 23 నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. 25వ తేదీ వరకు ఉపసంహరణ గడువు ఉంటుందన్నారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, నర్సయ్య, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, ఉమ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు డివిజన్

అభయహస్తం హామీల అమలుకు డిమాండ్

తొర్రూరు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని నియంతలా పాలించిన గత ప్రభుత్వం చేసిన తప్పులను ప్రస్తుత ప్రభుత్వం చేయకూడదని చెప్పారు. హామీలు అమలు చేయకుంటే ప్రజాస్వామిక వాదులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు సోమిరెడ్డి, యాకూబ్, అశోక్, సాయిమల్లు, సాంబయ్య, శ్రీనివాస్, దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి



దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

తొర్రూరు, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని, నూతన పీఆర్సీని ప్రకటించి, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు జె.నాగరాజు తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం సంఘం ఆధ్వర్యంలో మంగళవారం(నేటి) నుంచి దశలవారీగా నిర్వహించే ధర్మగ్రహ దీక్ష పోస్టర్ ఆవిష్కరించి, మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపులకు ధర్నా



తొర్రూరు, న్యూస్‌టుడే: బకాయి ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల విద్యార్థులతో కలిసి సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.సిద్దు మాట్లాడారు. బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొంతమంది విద్యకు దూరమయ్యే పరిస్థితులు ఎదురవుతున్నాయని వివరించారు. సంఘం బాధ్యులు రవి, గణేష్, మనోజ్, మహేష్, శ్రీకాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై కాంగ్రెస్ మోసం



కురవిలో ర్యాలీగా వెళుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, భారాస నాయకులు



నర్సింహులపేటలో..

కురవి, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన విస్మరించి, రైతు భరోసా ఇవ్వకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే గద్దె దిగాలని మాజీ ఎమ్మెల్యే డీఎస్. రెడ్యానాయక్ అన్నారు. రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ రైతులకు పెట్టుబడి సహాయంగా ఇచ్చే వానాకాలం పంటకు ఇవ్వకుండా ఎగ్గొట్టిందంటూ దానికి వ్యతిరేకంగా సోమవారం కురవిలో భారాస ఆధ్వర్యంలో ర్యాలీ తీసి ఆలయ కూడలిలో మానవహారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. రైతుబంధు అందించని పక్షంలో ప్రభుత్వం నుంచి తప్పుకోవాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు లాలయ్య, కురవి సహకారం సంఘం ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు

నర్సింహులపేట: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాపై హామీ ఇచ్చి మోసం చేసిందని భారాస మండలాధ్యక్ష, కార్యదర్శులు మైదం దేవేందర్, సుధీర్‌రెడ్డి అన్నారు. నర్సింహులపేటలో సోమవారం భారాస శ్రేణులు రాస్తారోకో చేసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. నాయబ్ తహసీల్దార్ సంజీవాకు వినతి పత్రం అందజేశారు. భారాస యూత్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, శ్రీశైలం, నాయకులున్నారు.

ప్రజాసమస్యలపై నిరంతర పోరాటం

మహబూబాబాద్, న్యూస్‌టుడే: పేద వర్గాల సమస్యల పరిష్కారానికి ఉద్యమించేది ఎర్రజెండా పార్టీయే అని సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు అల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం పురపాలక సంఘం పరిధిలోని జ్యోతిబసు నగర్‌లో నిర్వహించిన జ్యోతిబసునగర శాఖ మహాసభలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. మహాసభలో సీపీఎం నాయకులు సమ్మెట రాజమౌళి, చీపిరి యాకయ్య, హేమానాయక్, రావుల రాజు పాల్గొన్నారు. సీపీఎం జ్యోతిబస్‌నగర శాఖ కార్యదర్శిగా పేర్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా ఖాజాబీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సంగ్రహణాత్మక పరీక్షలు షురూ..



కంబాలపల్లి ప్రాథమిక పాఠశాలలో

మానుకోట, న్యూస్‌టుడే: ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు అర్ధ వార్షిక పరీక్షలుగా భావించే సంగ్రహణాత్మక మూల్యాంకనం (ఎస్ఏ-1) పరీక్షలు జిల్లాలో సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా పరీక్షల బోర్డు (డీసీఈబీ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం నుంచి ఆయా పరీక్షల ప్రశ్నాపత్రాలను ముందుగానే పాఠశాలలకు పంపించారు. ఈ నెల 24 వరకు ప్రాథమిక తరగతులు, 28 వరకు ఉన్నత తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షలు జరుగుతాయి. తొలిరోజు ఒకటి నుంచి ఏడో తరగతుల వారికి భాషా విషయ, ఎనిమిది నుంచి పదో తరగతి వారికి గణిత పరీక్షను నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వినతి పత్రం స్వీకరిస్తున్న వేణుగోపాల్

చిన్నగూడూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సీజీఆర్ఎఫ్ ఎన్‌వీ వేణుగోపాల్ చారి అన్నారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన చిన్నగూడూరు, మరిపెడ, నర్సింహులపేట మండలాల విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని వినతి పత్రాలను స్వీకరించారు. విస్సంపల్లి, ఎల్లంపేట నుంచి నాలుగు ఫిర్యాదులు వచ్చాయని, వాటిని సత్వరమే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సభ్యులు రమేష్, చరందాస్, రామారావు, ఎస్ఈ నరేష్. డీఈ మధుసూదన్, ఏఈలు ఉన్నారు.

బెదిరిస్తున్న వారిపై కేసు నమోదు చేయాలని వినతి

మహబూబాబాద్ రూరల్ (గూడూరు) న్యూస్‌టుడే: గిరిజన భూములను కాపాడాలని పోరాటం చేస్తున్న లంబాడి హక్కుల పోరాట సమితి నేత బానోతు చందులాల్‌నాయక్‌పై బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్ అన్నారు. గూడూరులో ప్రభుత్వ అసైన్డ్, చెరువు శిఖం భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సంఘం ఆధ్వర్యంలో సోమవారం మహబూబాబాద్‌లో ఆర్డీవో అలివేలుకు వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులున్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు

కేసముద్రం, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కల్వల, కేసముద్రం(వి) ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, కేజీబీవీలో అర్హత కలిగిన ఉపాధ్యాయలచే ఓటు నమోదు చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి పోటీ చేస్తున్న శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సంఘం అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి బీరం జనార్దన్‌రెడ్డి తదితరులున్నారు.

గోడ పత్రికల ఆవిష్కరణ

ఇనుగుర్తి, నెల్లికుదురు, న్యూస్‌టుడే: ఈ నెల 25న జాతీయ మాల మహానాడు మహాపాదయాత్ర, డిసెంబర్ ఒకటోతేదీన హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే మహాసంగ్రామ సభను విజయవంతం చేయాలని కోరుతూ మాలమహానాడు జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్ ఆధ్వర్యంలో సోమవారం ఇనుగుర్తి అంబేద్కర్ కూడలిలో గోడపత్రికలను ఆవిష్కరించారు. జిల్లా అధికార ప్రతినిధి చిట్టిమల్ల మహేష్, ఇనుగుర్తి అధ్యక్షుడు నాగెల్లి సుధీర్‌బాబు తదితరులున్నారు. నెల్లికుదురులో జరిగిన కరపత్రాల ఆవిష్కరణలో జాతీయ మాల మహానాడు జాతీయ కార్యదర్శి కార్యదర్శి అశోద భాస్కర్, సంఘం మండల అధ్యక్షుడు కె.ప్రశాంత్, నేతలున్నారు.

ఐడీ నెంబర్లు కేటాయించాలని వినతి

మానుకోట, న్యూస్‌టుడే: జిల్లాలో ఇటీవల డీఎస్సీ-2024లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు ట్రెజరీ ఎంప్లాయిస్ ఐడీ, ప్రాన్ నెంబర్లను వెంటనే కేటాయించాలని కోరుతూ జిల్లా ఖజానా అధికారి (డీటీఓ) సత్యనారాయణకు టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు సోమవారం వినతి పత్రం అందజేశారు. జిల్లాలో 362 మంది ఉపాధ్యాయులుగా నియమితులయ్యారని, వారికి వేతనాలు చెల్లించాలంటే ఎంప్లాయిస్ ఐడీ, ప్రాన్ నెంబర్లను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఎస్టీఓ కార్యాలయాల్లో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు ఇవ్వకుండా.. జాప్యం చేయకుండా ఈ నెంబర్లను కేటాయించాలన్నారు. లేనిపక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో డీటీఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తామన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే యాకూబ్, కురవి మండల బాధ్యులు శ్రీనివాస్, రాజశేఖర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ప్రభుత్వ పాఠశాలకు ఉపకరణాల వితరణ

మరిపెడ, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పట్టణంలోని విద్యా హెర్బ్స్ పరిశ్రమ నిర్వాహకులు రూ. లక్ష విలువైన కంప్యూటర్లు, సౌండ్ సిస్టం తదితర ఉపకరణాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు అనంతరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పరిశ్రమ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ రాజేష్, డిప్యూటీ జనరల్ మేనేజర్ శివ, అకౌంటెంట్ వసంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆజాద్ హింద్ ఫౌజ్ జెండా ఆవిష్కరణ

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: నేతాజీ సేవా సమితి మానుకోట ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వద్ద రాష్ట్రీయ ఆజాద్ హింద్ ఫౌజ్ దివస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మాలోతు రవీందర్‌చౌకిదార్ హాజరై మానుకోట పట్టణంలో తొలిసారిగా ఆజాద్ హింద్ ఫౌజ్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. నేతాజీ సేవా సమితి అధ్యక్షుడు కందుల నాగరాజు మాట్లాడుతూ . స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పట్టణంలోన నేతాజీ విగ్రహం వద్ద మెట్లు ఏర్పాటు చేయించి చుట్టూ శుభ్రం చేయించాలన్నారు. సేవా సమితి ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధానకార్యదర్శి కుదురుపాక వివేక్, కోశాధికారి మైస రోహిత్, కన్వీనర్ లక్ష్మినారాయణ, కో కన్వీనర్ వోబిలిశెట్టి రామకృష్ణ తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కురవి, న్యూస్‌టుడే: బలపాల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రగ్బీ, ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఈనెల 19న డోర్నకల్‌లో జరిగిన జిల్లా రగ్బీ పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. ఫుట్‌బాల్ అండర్-14 బాలికల విభాగంలో లక్ష్మీప్రసన్న, దీపిక, కరిష్మా, కీర్తి, ఫుట్‌బాల్ అండర్-14 బాలుర విభాగంలో నందకిశోర్, రాహూల్, సాయిచరణ్, యశ్వంత్, రగ్బీ అండర్-14 బాలుర విభాగంలో సన్నీ, అండర్-17 విభాగంలో ఉదయ్‌కుమార్ ఎంపికయ్యారు. వీరు నవంబరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారిని పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

మహబూబాబాద్ రూరల్ (గూడూరు): హనుమకొండలోని జేఎన్ఎస్ మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో గూడూరు మండలం సీతానాగరం ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి టి.సతీష్ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రైళ్ల హాల్టింగ్‌కు వినతి

గార్ల, న్యూస్‌టుడే: గార్ల రైల్వే స్టేషన్లో శాతవాహన, ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని మాజీ రైతుబంధు సమితి మండల సమన్వయకులు పానుగంటి రాధాకృష్ణ రాజ్యసభ సభ్యులు ఎంపీ వద్దిరాజు రవిచంద్రను కోరారు. ఈ మేరకు సోమవారం ఖమ్మంలోని ఎంపీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు చర్యలు



నెల్లికుదురు, న్యూస్‌టుడే: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయడానికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ఎన్పీడీసీఎల్ మహబూబాబాద్ ఎస్ఈ జె.నరేష్ తెలిపారు. నెల్లికుదురు నుంచి రామాంజపురం 33/11కేవీ ఉపకేంద్రం వరకు రూ.51లక్షల వ్యయంతో నిర్మించిన విద్యుత్తు లైన్ ద్వారా ఆయన సరఫరాను ప్రారంభించారు. ఎన్పీడీసీఎల్ డీఈ మధుసూదన్, ఏడీఈ చలపతిరావు, ఏఈ సింధు, ట్రాన్స్ కో అధికారులు రాంమోహన్‌రావు, శ్రీనివాసరావు, రమేష్‌కుమార్, రాజిరెడ్డి పాల్గొన్నారు.


పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



శ్రీకాంత్, పవన్‌తేజ్‌లకు చెక్కులు ఇస్తున్న టీఎస్సీఎస్టీఇహెచ్‌హెచ్ఏ నాయకులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: ఇద్దరు పేద విద్యార్థులకు తెలంగాణ ఎస్సీ ఎస్టీ, ఎంప్లాయిస్ హెల్పింగ్ హ్యాండ్ సంఘం (టీఎస్సీఎస్టీఇహెచ్‌హెచ్ఏ) సోమవారం ఆర్థిక సాయం అందజేసింది. నల్గొండకు చెందిన సీహెచ్ పవన్‌తేజ్‌కు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చినా, మహబూబాబాద్ జిల్లాకు చెందిన శ్రీకాంత్‌కు నిజాం కళాశాలలో పీజీ సీటు లభించినా కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా హాస్టల్ ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్నారు. దీంతో తమకు సహాయం చేయాలంటూ సచివాలయంలో టీఎస్సీఎస్టీఇహెచ్‌హెచ్ఏను ఆశ్రయించారు. సంఘం అధ్యక్షుడు గయక్వాడ్ తులసీదాస్ మాంగ్ వైద్య విద్యార్థికి రూ.25 వేలు, పీజీ విద్యార్థికి రూ.8 వేలు చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జె.దేవేందర్, కోశాధికారి బి.గుణవంత్, సంయుక్త కార్యదర్శి జి.ప్రశాంత్‌కుమార్, సభ్యులు బి.సోమన్న, కె.పరశురామ్, కె.స్వామి తదితరులున్నారు.

విద్యుదాఘాతంలో గిరిజన రైతు మృతి



భూక్య రాంజీ (పాతచిత్రం)

మహబూబాబాద్ రూరల్ (గూడూరు) న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై గిరిజన రైతు మృతి చెందిన సంఘటన గూడూరు మండలంలో హన్మాన్‌తండా శివారు బోరింగ్ తండాలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. బోరింగ్ తండాకు చెందిన బానోతు రాంజీ(68) తన రెండెకరాల వ్యవసాయ భూమిలో వరి, మిరప సాగు చేస్తున్నారు. ఉదయం వరికి నీరు పెట్టేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి మోటార్ ఆన్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై బావిలో పడి మృతి చెందారు. పోలీసులు సంఘటనాస్థలిని పరిశీలించి మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రంగి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గూడూరు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఖాసీం రాంజీ కుటుంబ సభ్యులు పరామర్శించారు.

వాహనం ఢీకొని యువకుడి..

మద్దిరాల, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలోని గోరెంట్ల శివారు జాతీయ రహదారి 365పై సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడ మండలం బురాన్‌పురానికి చెందిన ఆంబోతు ప్రశాంత్(30) అత్తగారి గ్రామమైన తొర్రూరు మండలం అమ్మాపురానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా. . వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. తమకు ఫిర్యాదు అందలేదని ఎస్సై ఎం.వీరన్న పేర్కొన్నారు.

విద్యార్థినికి తీవ్ర అస్వస్థత

గార్ల, న్యూస్‌టుడే: గడ్డి మందుతాగి ఓ విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన సోమవారం జరిగింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ పదో తరగతి విద్యార్థిని(16) ఇంట్లో జరిగిన గొడవలకు మనస్తాపానికి గురైనట్లు సమాచారం. గార్లలోని పాఠశాలకు వచ్చే ముందు గడ్డిమందు తాగి పాఠశాలకు వచ్చింది. గంట తరువాత తన తోటి విద్యార్థినులతో గడ్డిమందు తాగినట్లు చెప్పటంతో స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆ విద్యార్థినిని ఖమ్మం పట్టణానికి తరలించారు. ప్రస్తుతం ఆ విద్యార్థిని ఖమ్మంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పాఠశాలలో జరిగిన ఈ సంఘటనపై ఎఫ్ఏసీ హెచ్ఎం ఎం.సుందర్‌కుమార్ డీఈవోకు లిఖితరూపంగా అందజేశారు.

12 మంది అరెస్టు

దంతాలపల్లి, న్యూస్‌టుడే: భూ తగదా విషయమై ఇరువర్గాలు ఘర్షణకు దిగిన సంఘటనలో 12 మందిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఈ నెల 1న నిదానపురంలోని భూ వ్యవహారంలో ఇరువర్గాలు గొడవకు దిగినట్లు తెలిపారు. పలువురిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

మాతాశిశు సంరక్షణ కార్యక్రమాల్లో వెనుకంజ

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మాతా, శిశు సంరక్షణ కార్యక్రమాల అమలులో జిల్లా వెనకబడి ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జి.మురళీధర్‌రాజు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మహబూబాబాద్ డివిజన్ పరిధిలోని వైద్యాధికారులు, ఇతర అధికారులతో జాతీయ కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. సాధారణ ప్రసవాలు జరిగేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రపంచ అయోడిన్ లోపం రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా వారం రోజులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వివిధ ప్రాంతాలకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమీల, వైద్యులు సారంగం, నాగేశ్వరరావు, సుధీర్‌రెడి, డిప్యూటీ డెమో కె.ప్రసాద్, కేవీ.రాజు, గీత, పురుషోత్తం, శారద, వి.రామకృష్ణ, రుక్ముద్దీన్, వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరు మండలాలకు నిలిచిన నీటి సరఫరా



కుమ్మరికుంట్లలో ట్యాంకర్‌తో నీరు అందిస్తున్న పంచాయతీ సిబ్బంది

దంతాలపల్లి, న్యూస్‌టుడే: గ్రామాలతో పాటు శివారు ఆవాస ప్రాంతాలకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో నాలుగు రోజులుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరిపెడలోని ఎదళ్లగుట్ట వద్ద నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ నుంచి మరిపెడ, నర్సింహులపేట, దంతాలపల్లి, తొర్రూరు, నెల్లికుదురు, రాయపర్తి మండలాలకు శుద్ధి జలం సరఫరా చేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. గ్రిడ్ సమీపంలో ప్రధాన పైపులైన్ దెబ్బతినడంతో సరఫరా నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. పైపులైన్ మరమ్మతుకు గురైన విషయం తెలియక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మరమ్మతు పనులు యుద్ధప్రతిపాదికన కొనసాగుతున్నాయని, తరుచూ వర్షపు జల్లులు కురవడంతో పనుల నిర్వహణకు అంతరాయం కలుగుతోందని అధికారులు చెబుతున్నారు. దీంతో గ్రామాల్లోని చేతిపంపులు, బోర్లు, బావులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. గ్రామ పంచాయతీల ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నట్లు జీపీ సిబ్బంది పేర్కొన్నారు. ఈ విషయాన్ని గ్రిడ్ ఏఈ రాకేష్ వద్ద ప్రస్తావించగా పైపులైన్ దెబ్బతిన్నట్లు తెలిపారు. పునరుద్ధరణ పనులు చేపట్టామని సోమవారం రాత్రి వరకు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు.

ధర్మాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

దంతాలపల్లి, న్యూస్‌టుడే: డీఏ, పీఆర్సీ, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండలాధ్యక్షుడు బండ శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దీక్షకు సంబంధించిన కరపత్రాలను సోమవారం దంతాలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో శ్రీదేవి, ప్రధానోపాధ్యాయుడు వేణుమాధవ్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. సమస్యల పరిష్కారాన్ని కోరుతూ 22న పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన, 28న మండల కేంద్రాల్లో తహసీల్దార్లకు వినతి పత్రాల అందజేత, నవంబర్ 5న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు హరిబాబు, మహేందర్, శ్రావణ్‌కుమార్, నాగిరెడ్డి, మంజుల, తిరుపతి పాల్గొన్నారు.